

విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అశోక్, ఉపాధ్యాయులు

## ధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలి

- ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్టు డాక్టర్ అశోక్
- బ్రాహ్మణపల్లిలోని కస్తూర్బాలో విద్యార్థినులకు అవగాహన

గూడూరు, డిసెంబర్17: జీవితంలో సమస్యలు వస్తే ధైర్యంతో ఎదుర్కొని విజయం సాధించాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆత్మహత్మల నివారణపై బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు ఆదివారం ఆరోగ్యమిత్ర ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మహత్యలకు యత్నించే వారిపై సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యం, భరోసా నింపాలన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి, అన్నిదారులు మూసుకుపోయినప్పుడు మేమున్నామంటూ భరోసా ఇస్తే సమస్య నుంచి బయట పడుతారన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ 10 సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర ప్రతినిధి వెంగంటి శుభ, ఉపాధ్యాయులు రజిత, సునీత, అనిత, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

## వధూవరులకు బీఆర్ఎస్ శ్రేణుల ఆశీర్వాదం

పెద్దవంగర, డిసెంబర్ 17: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి కూతురు వివాహం ఆదివారం స్థానిక సాయి గార్డెన్స్‌లో జరిగింది. బీఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో తొర్రూరు జడ్పీటీసీ ఎం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు సుధీర్‌కుమార్, శ్రీనివాస్, సుధాకర్, వెంకట్రామయ్య, మల్లికార్జునాచారి, ఆశయ్య, యాకన్న, ప్రవీణ్, రవి, ముజీబుద్దీన్ పాల్గొన్నారు.



యూత్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు

## 'పీఎఫ్‌యూయూఏ' కమిటీ ఎన్నిక

తొర్రూరు, డిసెంబర్ 17: ప్రభాస్ ఫ్యాన్స్ యువసేన యూత్ అసోసియేషన్(పీఎఫ్‌యూయూఏ) నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందుల యాకన్న, ఉపాధ్యక్షులుగా గద్దల సతీశ్, మంగళపల్లి సదిన్, ప్రధాన కార్యదర్శిగా వల్లపు రవి, కోశాధికారిగా వేల్పుల క్రాంతి, సలహాదారుడిగా శంకరబోయిన కార్తీక్, తొర్రూరు మండల అధ్యక్షుడిగా గద్దల శివ, ఉపాధ్యక్షులుగా బొమ్మగాని మనోజ్, పొద్దిల మధు, కోశాధికారిగా ఈన్నెపల్లి సందీప్, ప్రధాన కార్యదర్శిగా మంగళపల్లి సాగర్, సలహాదారులుగా అల్లి సాగర్, దంతాలపల్లి మండల అధ్యక్షుడిగా ధర్మారపు మహేందర్, నెల్లికుదురు మండల అధ్యక్షుడిగా ఇల్లందుల మధు, వెలికట్ట గ్రామ అధ్యక్షుడిగా జాటోత్ తరుణ్, సన్నూరు అధ్యక్షుడిగా ఎస్‌కే అజీమ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు యాకన్న మాట్లాడుతూ.. ప్రభాస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. సందేశాత్మక చిత్రాలు తీయడంలో ప్రభాస్‌కు సాటి ఎవరూ లేరన్నారు. సమాజానికి వినోదాన్ని అందిస్తున్న సినిమా రంగాన్ని ఆదరించాలని కోరారు.

# వెదజల్లు.. లాభాలు ఫుల్లు

- ఆధునిక పద్ధతిలో వరిసాగు లాభదాయకం
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- కూలీల కొరత ఉండదంటున్న వ్యవసాయ అధికారులు
- వెదజల్లే విధానంపై మొగ్గు చూపుతున్న రైతులు



బంజారలో వెదజల్లే పద్ధతిలో నాటిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

డోర్నకల్, డిసెంబర్ 17: వ్యవసాయ రంగంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. వరిలో విత్తనం వెదజల్లే విధానం పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నారు. కూలీల కొరతను సైతం అధిగమించవచ్చని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు జిల్లాలోని అధిక శాతం రైతులు ఈ విధానానికే మొ గ్గు చూపుతున్నారు. ఇటీవల వరకు నారుపెంచి నాటువేసే విధానంతో రైతులు వరి సాగు చేశారు. కానీ వాతావరణంలో మా ర్పులు, వ్యవసాయ కూలీల కొరత, పెట్టుబడి ఖర్చులు పెరగడంతో వరిసాగు గిట్టుబాటు కానీ పరిస్థితి నెలకొన్నది. ఇలాంటి సమయంలో పొలంలో నేరుగా వెదజల్లే పద్ధతి ద్వారా వరి పంటను సాగు చేస్తున్నా రు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ అధికారుల సహకారంతో ఈ పద్ధతిలో సాగు చేస్తూ రైతులు సత్ఫలితాలు పొందుతున్నారు. పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, దిగుబడి పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వెదజల్లే విధానంలో దొడ్డు రకాలకు ఎకరానికి 10-12 కిలోలు, సన్న రకాలకు 8-10 కిలోల విత్తనాలు సరిపోతాయని తెలిపారు. 'సాగుకు ముందు రైతులు విత్తనాలను 24 గంటలు విత్తనాన్ని మండె కట్టుకొని, ముక్క పగిలిన విత్తనాన్ని వెదజల్లుకోవాలి. కలుపు యాజమాన్యంలో భాగంగా ఎకరానికి ఆక్సాడయార్టిల్ 35 గ్రాములు,



గార్లలో కోతకు వచ్చిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రామారావు (ఫైల్)

పెట్రిల్లాక్లోర్ 400 మిల్లీలీటర్ల పొడి ఇసుకలో కలిపి విత్తిన 3 నుంచి 5 రోజుల మధ్య చల్లుకోవాలి. సాధారణ వరి సాగుతో పోల్చుకుంటే వెదజల్లే పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. 7 నుంచి 10 రోజులు ముందు వరికోతకు వస్తుంది. 10 నుంచి 15 % దిగుబడి పెరుగుతుంది. వరినారు పెంచడం, నాట్లు వేసే కూలీల ఖర్చు కూడా రైతులకు తగ్గుతుంది. ఎకరానికి రూ.6వేల నుంచి రూ.7వేల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందంటున్నారు. జిల్లాలో వానకాలంలో 3వేల ఎకరాల్లో రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశారు. యాసంగి సాగు వెదజల్లే విధానానికి అనువుగా ఉంటుందని, రైతులకు జిల్లా, మండల, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వరి సాగులో వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానంతో సాగు విస్తీరణం పెంచుతున్నాం. ప్రస్తుతం కొందరు రైతులు ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. పెట్టుబడి తగ్గి పంట దిగుబడి అధికంగా వస్తుంది. అశించిన స్థాయిలో రైతుకు ఆదాయం పొందవచ్చు. రైతులకు వెదజల్లే పద్ధతి సాగుపై సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

–లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి మహబూబాబాద్

### 10 ఎకరాలు సాగు చేస్తున్నాం



వెదజల్లే పద్ధతితో 10 ఎకరాలు వరి సాగు చేస్తున్నాం. పెట్టుబడి, కూలీల ఖర్చు తగ్గుతున్నది. నాటు వేసే పద్ధతి కంటే ఈ విధానంలో దిగుబడి పెరుగుతున్నది. నాటు విధానం ద్వారా విత్తనం ఖర్చు కూడా ఎక్కువ అవుతున్నది. యాసంగి పంటను వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్నా..

–గండు రవి, రైతు, పెరుమాండ్ల సంకీస గ్రామం

### వెదజల్లే విధానం బాగున్నది



వెదజల్లే పద్ధతిలో వరి సాగు బాగున్నది. రైతులకు కూలీల ఖర్చు తగ్గుతుంది. మూడేళ్లగా ఈ విధానంతోనే పంటను సాగు చేస్తున్నా. మంచి దిగుబడి వస్తున్నది. వ్యవసాయ అధికారులు వెదజల్లే పద్ధతి సాగుపై రైతులకు సలమాలు, సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ఈ విధానమే మేలు.

–బ్రహ్మారెడ్డి, రైతు, బంజర గ్రామం



పెరుమాండ్ల సంకీస గ్రామంలో వెదజల్లే పద్ధతిలో వరి పంట (ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోర్నకల్, డిసెంబర్ 17: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీ వద్ద ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్య తండాకు చెందిన రమణ బైక్‌పై డోర్నకల్ వస్తుండగా, రాజు తండాకు చెందిన భూక్యా వస్రం బైక్‌పై డోర్నకల్ నుంచి రాజుతండాకు వెళ్తున్న క్రమంలో ఎస్సీ, బీసీ కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వస్రం తలకు, రమణ కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగ్రాతులను 108 వాహనంలో ఖమ్మం ఏరియా దవాఖానకు తరలించారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే

డోర్నకల్, డిసెంబర్ 17: జాతీయ పెన్షనర్స్ డే వేడుకలను డోర్నకల్ జైన్ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ మాట్లాడుతూ.. డీఎస్ నకారా కృషి ఫలితంగా పెన్షనర్లందరూ పింఛన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పెన్షనర్లకు ప్యాకెట్ డైరీలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజాలీ, సర్వయ్య, ఇబ్రహీం, ఎల్లేశ్, మల్లయ్య, రమేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రహీం